క్లుప్తంగా

దేవరకొండ డిపోకు రాష్ట్రస్థాయి అవార్డులు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట్‌రెడ్డి

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపోకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కినట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతిచక్రం అవార్డుల్లో భాగంగా డిపోకు చెందిన టిమ్ డ్రైవర్ వడ్డెపల్లి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యాడు. శనివారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు రూ.51వేల రివార్డు అందుకున్నట్లు తెలిపారు. అదే విధంగా డిపోకు చెందిన మరో ప్రైవేట్ బస్సు డ్రైవర్ ఆర్.నెహ్రూకు రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకుతో అవార్డు లభించిందని పేర్కొన్నారు.ఉత్తమ అవార్డు పొందిన వారికి డిపో మేనేజర్‌తో పాటు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో యువతి మృతి



జక్కుల కవిత (ఫైల్)

గుర్రంపోడు : గుండెపోటుతో యువతి మృతి చెందిన ఘటన గుర్రంపోడు మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జక్కుల కవిత(18) అనే యువతి తల్లితో కలిసి రోజు మాదిరిగానే ఆటోలో మిరుప కాయలు కోయడానికి మండలంలోని మొసంగి గ్రామానికి వెళ్లింది. ఆటో దిగి పనికి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న 108వాహన సిబ్బంది సీపీఆర్ చేసినా అప్పటికే పల్స్ పడిపోయింది. మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి హుటాహుటిన తరలించగా మండల వైద్యాధికారి డాక్టర్ భవాని చక్రవర్తి పరీక్షించి కార్డియాక్ అరెస్టుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మండలకేంద్రానికి చెందిన సత్తయ్య, రాములమ్మ దంపతుల మూడో కుమార్తె కవిత తల్లిదండ్రులతోపాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వినోద్‌కుమార్

గుర్రంపోడు : బీజేపీ నూతన మండల అధ్యక్షుడిగా మామిడి వినోద్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన నియోజక వర్గ ఇన్‌చార్జ్ నివేదితరెడ్డి, శ్రీధర్‌రెడ్డి,జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బహుమతుల ప్రదానం

మిర్యాలగూడ అర్బన్ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సామాజికవేత్త హమీద్ షేక్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం డాక్టర్ ప్రశాంత్ బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ జయరాజన్ ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన మైదానాలు

పెద్దవూర : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికి తీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. ఈ క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. రూ.లక్షల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా మైదనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వాటికి అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చింది. కానీ ఈ మైదానాల వల్ల ఎవరికి లబ్ధిచేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో బోర్డులు ఏర్పాటు చేసి మమా అనిపించారు. ఏ ఒక్క క్రీడా మైదానంలోనూ ఒక్కరోజు కూడా ఆటలు ఆడిన దాఖలాలు లేవు, క్రీడా ప్రాంగనాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు అధికారులను కోరారు. పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే గ్రామంలోని యువకులు, క్రీడాకారులు పొద్దంతా ఆటలు ఆడితే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు ఒప్పుకోలేదు.

ప్రాణాళిక బట్టి నిధులు

క్రీడా ప్రాంగణానికి దొరికిన స్థలాన్ని బట్టి అందులో ఏర్పాటు చేసిన క్రీడల ఎస్టిమేషన్ బట్టి నిధులు మంజూరు చేశారు. ఈ మైదానాలలో కబడ్డీ, ఖో-ఖో, హైజంప్, లాంగ్‌జంప్, వాలీబాల్ కోర్టులు, వ్యాయామాల కోసం సింగిల్ బార్, డబుల్ బార్‌లు ఏర్పాటు చేస్తే స్థలాన్ని బట్టి రూ.50వేల నుంచి రూ.2.50 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో క్రీడా మైదానాల్లో మట్టిని పోసి చదును చేయడం, బోర్డులు ఏర్పాటు చేయడం, కోర్టులు వేయడం, వ్యాయామాల కోసం బార్‌లు వేశారు. ఎక్కడా అన్ని క్రీడలకు కావాల్సిన కోర్టులు వేయటానికి స్థలాలు దొరకడం లేదు. కబడ్డీ, ఖో-ఖో కోర్టులు మాత్రమే వేస్తే నిధులు అంతగా రావు. దీంతో గ్రామ పంచాయతీల పాలకులు అంతగా ఆసక్తి కనపర్చ లేదని చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు చాలా వరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. దీంతో అనేక గ్రామాలల్లో క్రీడా మైదానాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

తుప్పుపడుతున్న సామగ్రి

మండలంలోని పెద్దవూర మండల కేంద్రంలోనూ, నాయినవానికుంటతండా తదితర గ్రామాల్లో ఇప్పటికీ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. బట్టుగూడెం, పొట్టివానితండా, లింగంపల్లి, జయరాంతండా తదితర గ్రామాలలో చాలా దూరంలో నిర్మించారు. ఏ క్రీడా ప్రాంగణంలో చూసినా కంపచెట్లు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఏర్పాటు చేసిన వాలీబాల్, డబుల్, సింగిల్ బార్‌లు తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



బట్టుగూడెంలో తుప్పుపట్టిన బార్‌లు



దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన బోర్డు

వినియోగంలోకి తీసుకువస్తాం

"గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా మైదానాల వినియోగంలోకి తీసుకువస్తాం. ప్రస్తుతం మైదానాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, మైదానాల చుట్టూ మొక్కలు నాటించి పచ్చదనంతో వాటిని ఆధునీకరిస్తాం. ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించేలా అవగాహన కల్పిస్తాము.

–ఉమాదేవి, ఎంపీడీఓ, పెద్దవూర

పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకొండ : గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరేడుగొమ్ము, డిండి, దేవరకొండ మండల ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైకి రాకుండా శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటూ సమస్యలు తెలత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.రోడ్లలకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి ఫాగింగ్ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీఓలు ప్రవీణ్, నీలిమ, డానియల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వారికి జైలు శిక్ష

త్రిపురారం : రోడ్డుపై పోలీసు విధులకు ఆటకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జైలు శిక్ష పడింది. శనివారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వీర శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న బాబుసాయిపేట రోడ్డులో రంగా ఫుడ్ రైస్ మిల్ సమీపంలో త్రిపురారం పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇదే సమయంలో మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై త్రిపురారం నుంచి బాబుసాయిపేట వైపు వస్తున్నారు. అప్పుడే పోలీసులు వారి బండిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయడానికి ప్రయత్నించారు. దీంతో మలికంటి జనార్దన్ అతడి తల్లి వెంకటమ్మలు పూటుగా మద్యం తాగి డ్రంకెన్ డ్రైవ్‌కు సహకరించకుండా పోలీస్ సిబ్బందిని నానా బూతులు తిడుతూ విధులకు ఆటకం కలిగించారు. వెంటనే పోలీసులు వీరిని అదుపులోకి తీసుకోని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మిర్యాలగూడలోని రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. రోడ్డుపై మద్యం తాగిన మైకంలో పోలీసుల విధులకు ఆటకం కలిగించిన మలికంటి జనార్ధన్, వెంకటమ్మలకు జైలు శిక్ష విధించడంతో జిల్లా కేంద్రంలోని జైలుకు తరలించారు. ప్రజల క్షేమం కొసం విధులు నిర్వహిస్తున్న పోలీసు వారికి సహకరించాలని చట్టవిరుద్ధగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వీర శేఖర్ హెచ్చరించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానం పొందవచ్చు



ఎన్‌సీసీ కేడెట్లతో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : విద్యార్థులు తమ దైనందిన జీవితంలో క్రమశిక్షణతో ఉంటే తమ కలలను నిజం చేసుకోని ఉన్నత స్థానాన్ని పొందవచ్చని 31వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ టీఎం.లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన నూతన ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గొప్ప ఆశయాలను కలిగి ఉండాలని, వాటిని సాకారం చేసుకోవడానికై క్రమశిక్షణ పాటించాలని, తద్వారా జీవితంలో దేన్నైనా సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ఉపేందర్, భీమార్జున, నాగరాజు, సీటీఓ నరేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస సామర్థ్యాలు నేర్పించాలి



పెద్దవూర : మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు చదవడం, రాయడం, లెక్కలు చేయడం తప్పనిసరిగా నేర్పించాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పెద్దవూర, నాగార్జునసాగర్, చలకుర్తి, పులిచర్ల, వెల్మగూడెం స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని హెచ్‌ఎంల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలలో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, మధ్యాహ్న భోజనం వేడి వేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల నోడల్ అధికారి శేషు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఝాన్సీ, నారాయణరెడ్డి, సుదర్శన్, హిమవంతరెడ్డి పాల్గొన్నారు.

గుర్రంపోడు : ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించేలా అమలు జరగనున్న ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి తరి రాములు కోరారు. శనివారం ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ యూనిట్ ప్రణాళికను సిద్ధం చేసుకోవడం, వెనుకబడిన విద్యార్థులను గ్రూపులుగా విభజించి దత్తత తీసుకోవడం, బహుళ తరగతి బోధనలో మెళకవులు పాటించడం, లైబ్రరీ పుస్తకాల వినియోగం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థి కేంద్రీకృత బోధన జరగాలని, ఉపాధ్యాయులు తనకు నచ్చిన బోధనాపద్ధతులు అమలు చేసి లక్ష్యాల సాధనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారులు వెంకట్రామ్ రెడ్డి. యాదగిరి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల సమాఖ్య మహిళలు, అధికారులు



కొండమల్లేపల్లి : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

హాలియా : గంజాయి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. శనివారం హాలియా పట్టణంలో అనుముల మండల సమాఖ్య ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నతమైన జీవితాన్ని గడపాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం ఎంతో ప్రమాదకరమన్నారు. గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శ్రీనివాస్, నందిని మండల సమాఖ్య మహిళలకు రక్త పరీక్ష, బీపీ, షుగర్, ఫీవర్ హెల్త్ చెకప్ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం కళావతి, ఏపీఓ ప్రవీణ్, చారి, సైదయ్య, రామస్వామి, విజయలక్ష్మి, ధనమ్మ, వీఓఏఎస్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

గంజాయి రహిత సమాజాన్ని స్థాపిద్దాం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలపైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్ వాడొద్దన్నారు. యు వత భవిష్యత్‌కు లక్ష్య నిర్దేశన చేసుకోని అందుకు తగ్గట్టుగా కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య ఆవరణలో మొక్కలు నా టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీఓ నర్సింహారావు, ఏపీఓ రాంచందర్‌నాయక్, అధ్యక్షురాలు మమత, సీసీలు రమేశ్, రవి, మథిన్, ఈసి రాజు, సెక్రటరీ డాకునాయక్, వీఓఏలు రాజు, సంధ్య, సరిత, శారద, అనీషా, స్వామి, బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

అడవిదేవులపల్లి : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై పచ్చని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 8712670266కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంపీఓ మెహిబిన్ అహ్మద్, ఏపీఎం శేషయ్య, ఏపీఓ సూర్యానాయక్, పోలీసులు లింగయ్య, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, మహిళా సమాఖ్య నాయకులు విజయలక్ష్మి, రోజమ్మ, సాంబ, నాగ, నాగేశ్వర్‌రావు, బ్రహ్మరంభా, జ్యోతిలతో పాటు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : మాదక ద్రవ్యాల వినియోగం లేని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా నాగార్జున సాగర్‌ను మార్చడం మనందరి కలగా పెట్టుకోవాలని, అందుకుగాను విద్యార్థులంతా యాంటీ డ్రగ్స్ వారియర్స్‌గా ఉండాలని సాగర్ సర్కిల్ సీఐ బీసన్న పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా శనివారం సాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాగర్ ఎస్‌ఐ సంపత్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహా పొందవచ్చు



లీగల్ సొసైటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి సుజయ్

మిర్యాలగూడ టౌన్ : అడ్వకేట్ ఫర్ జస్టీస్ లీగల్ సొసైటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవచ్చని మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన అడ్వకేట్ ఫర్ జస్టిస్ ది లీగల్ సొసైటీ ప్రధాన కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, సబ్ రిజిస్ట్రార్ బలరాంలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అడ్వకేట్ ఫర్ జస్టిస్ లీగల్ సొసైటీ కార్యదర్శి మధుకర్ మాట్లాడుతూ పేద వర్గాలకు, ట్రాన్స్‌జెండర్ వారికి పూర్తిగా న్యాయ సేవలు ఉచింతంగా అందించనున్నట్లు తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సొసైటీ తోడ్పడుతుందన్నారు. సొసైటీ సేవలు 24గంటలు వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ అలుగుబెల్లి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షురాలు అలుగుబెల్లి స్వరాజ్యం, సబార్డినేటర్ దైద శ్రీనివాస్, సొసైటీ సభ్యులు గణేష్, జ్యోతి, శ్రీకాంత్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, మునగాల శైలందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

డిండి : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నలమల్ల ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఏఐఎస్‌ఎఫ్ 89వ వార్షికోత్సవ వేడులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్, సాయి, భాను. శశి, అక్షయ్, ఆనంద్, అరవింద్, కృష్ణవేణి, మౌనిక పాల్గొన్నారు.

పల్లె దవాఖాన సందర్శించిన డీప్యూటీ డీఎంహెచ్‌ఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సాక్షి ఎఫెక్ట్..

చింతపల్లి : మండల కేంద్రంలోని పల్లె దవాఖానాను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి, వైద్యా, ఆరోగ్య శాఖ అధికారులు శనివారం సందర్శించారు. గత మూడు రోజుల నుంచి ఆరోగ్య ఉపకేంద్రం తెరచుకోకపోవడంతో శనివారం 'సాక్షి'లో 'తెరచుకోని పల్లె దవాఖాన' అనే శీర్షికన కథనం ప్రచురితమైన కథనానికి డీప్యూటీ డీఎంహెచ్‌ఓ స్పందించి సందర్శించి మాట్లాడారు. పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రస్తుతం దవాఖానాలో సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

మిర్యాలగూడ : రైతులకు అవసరమైన యూరియా మండలంలోని పీఏసీఎస్‌లలో సమృద్ధిగా అందుబాటులో ఉందని ఏఓ సైదానాయక్ అన్నారు. శనివారం ఆయన మిర్యాలగూడ మండలంలోని పలు పీఏసీఎస్‌లను సందర్శించి యూరియా స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. యూరియాను ఈ పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు చేపట్టాలని సొసైటీ సీఈఓలను ఆదేశించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



ర్యాలీలో నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు, విద్యార్థులు

దేవరకొండ : హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని దేవరకొండ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబు అన్నారు.శనివారం ఉదయం అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వాక్ ఫర్ కాజ్(2కె)రన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 5ఏళ్ల లోపు చిన్నారులకు, నిరుపేద విద్యార్థులకు సహృదయంతో ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ భాస్కర్‌రెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ దూర విద్యా 2024–25 సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు మండల కేంద్రంల్లోని జెడ్పీహెచ్‌లో స్టడీ సెంటర్ అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు మండల ఎంఎన్‌ఓ, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇతర వివరాలకు స్టడిసెంటర్ కోఆర్డినేటర్ జార్జిని సంప్రదించాలని కోరారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముత్యాలమ్మ దేవాలయ కమిటీ కార్యదర్శి నేతాళ్ల వెంకటేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ముత్యాలమ్మ దేవాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సహస్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యాన్ని దగ్గర చేస్తున్న క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు శివపార్వతి, ఉషారాణి, శైలజ, రాజేష్, యాదమ్మ, భిక్షమయ్య ఉన్నారు.

పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ముందస్తుగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. పలు పాఠశాలలో ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. –సాక్షి, నెట్‌వర్క్



మిర్యాలగూడటౌన్ : ఆదిత్య పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు



హాలియా : న్యూకిడ్స్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి



గుర్రంపోడు : గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో..



కొండల్లేపల్లి : రెయిన్ బో పాఠశాలలో..



త్రిపురారం : లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో..



మిర్యాగూడ అర్బన్ : కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న డౌహిల్ స్కూల్ విద్యార్థులు



మిర్యాలగూడ : వర్డ్ అండ్ డిడ్ స్కూల్‌లో..



నాగార్జున సాగర్ : న్యూకిడ్స్ పబ్లిక్ స్కూల్‌లో..

ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 26న నల్లగొండలోని అంబేడ్కర్ భవనంలో ట్రైబల్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా నిర్వహించనున్న ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సిద్ధునాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు చందునాయక్, సంతోష్, సతీష్, సాయిరాం, కిషన్ ఉన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : మద్యం బాటిళ్లు పట్టుకున్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం-గణేష్‌నగర్ సమీపంలో గల లారీ అసోసియేషన్ పక్కన రాము టీస్టాల్‌లో నమ్మదగిన సమాచారం మేరకు దాడులను నిర్వహించడం జరిగింది. ఈ దాడుల్లో కింగ్ ఫిషర్లు 6, కింగ్ ఫిషర్ లైట్ 69, బీర్లు 6. హైవార్డ్స్ 8 బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ బీర్లు అన్ని ఖాళీ సీసాల బస్తాలో దాచి పెట్టగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రమావత్ అశోక్ పై కేసు నమోదు చేసినట్లు నరేష్ తెలిపారు.

సారా పట్టివేత

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామ సమీపంలో పడమటితండా నుంచి కొండమల్లేపల్లి వైపు ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారాను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది స్వామి, శ్రీనయ్య, వేణుగోపాల్‌రెడ్డి, నాంపల్లి కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.